హాస్యకథ

# పతిభ(భు)క్తి!?

కొండా రాజశేఖర్ గౌడ్



తెలుగు పండిత్ 2వ గ్రేడ్
ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల
సాటాపూర్ ఫారం
రెంజల్ - మండలం
నిజామాబాద్ - జిల్లా.



సమయం ఐదు గంటలని చెప్పడానికి ఆ ఆఫీసులోని గోడ గడియారం టిక్...టిక్... మని ఐదు గంటలు కొట్టింది.

ఉదయం నుండి సాయంత్రం వరకూ నిస్సత్తువ. నిర్లక్ష్యం ముసుగులో ఉన్న క్లర్కు రాజరత్నం ఈ ఐదు గంటల కొరకే నిరీక్షిస్తూ - నిరీక్షిస్తూ. గడియారం నుండి విన్పించిన చప్పుడు తన కర్ణభేరిని చేరగానే యుద్ధంలో పాల్గొనడానికి వెళ్ళిన సైనికుడి ఆత్రంలా టకటకా తన ముందున్న ఫైళ్ళ గుట్టలను. రిజిష్టర్‌లను అటూ ఇటూ సర్ది పక్క సెక్షన్లోని తోటి క్లర్క్ వైపు చూశాడు.

గేట్ వద్ద సీనియర్ క్లర్క్ లక్ష్మణరావు అతణ్ణి పిలుస్తోన్నట్లుగా సైగ చేశాడు.

ఆఘు మేఘాల మీద ఆయన లక్ష్మణరావు వైపు పరిగెత్తాడు.

"పోదాం పద!" అన్నాడు లక్ష్మణరావు.

బయట సైకిల్ స్టాండ్ దగ్గర పాత ఇనుప సామాను కొనేవారు కూడా తీసుకోవడానికి సంకోచించే లక్ష్మణరావు కుక్కిలూనా. రాజరత్నం డొక్కు సైకిలూ మేడ్ ఫర్ ఈచ్ అదర్ లా కన్పించాయి.

రాజరత్నం లక్ష్మణరావుని అనుసరిస్తూ వచ్చి సైకిల్ తాళం తీశాడు.

లూనాకు వేసిన రెండు తాళాలు తీసి ఏదో జ్ఞాపకం వచ్చిన వాడిలా..

'నీ ద్విచక్రవాహనాన్ని ఇక్కడే పెట్టు' అన్నట్లు సైగ చేశాడు.

గత్యంతరం లేక ఎన్నో ఏళ్ళుగా అతి జాగ్రత్తగా కాపాడుతూ వస్తోన్న తన ముద్దుల సైకిల్‌ను మరెన్నో జాగ్రత్తలతో ప్యూన్‌కి అప్పగించి లూనా ఎక్కబోయాడు.

అంతే... సదరు లక్ష్మణరావు రాజరత్నంను ఒక్కతోపు తోశాడు. రాజరత్నం కిందపడి చుట్టూ చూసి, లేచి, లక్ష్మణరావు సైగను అర్థం చేసుకొని లూనాను తోయడం మొదలెట్టాడు.

అసలే సాయంత్రం. కడుపులో ఆకలి! పైగా సీనియర్ గారిది భారీకాయం.

ఇన్ని అవస్థల మధ్య లూనాను తోసి దానికి కదలిక తెచ్చి మళ్ళీ లూనా ఎక్కబోయాడల్లా లక్ష్మణరావు గారు నోటి నుండి రక్తం కక్కడం చూసి నోటి మాట ఆగిపోయి రావుగారి వైపు చూశాడు.

లక్ష్మణరావు గారు మాత్రం తన చేతి వేలిని నోటిలో గరిటలా కలియ తిప్పుతుండడం గమనించి తేరుకొని "సార్! ఇదీ..." అని రక్తం గర్మను చూయించాడు.

అడ్వర్టయిజ్‌మెంట్ లెవెల్లో లక్ష్మణ్‌రావు "పాన్ పరాగ్" అని అరిచాడు.

ఇందాకటి నుండి సీనియర్ గారు సైగ సైరన్

మోగించడానికి కారణం ఇదా అని నోరు తెరిచాడు.

ఎంతో కష్టపడి ఆ రెండు శరీరాలనూ వారి కాలనీ వరకు మోసుకొచ్చి 'ఇక నావల్ల కాదు బాబోయ్' అన్నట్టుగా ఆ లూనా ఆగిపోయింది.

'ఆఁ' అని నోరు తెరిచి, 'మళ్ళీ తోసే కార్యక్రమమా' అని అక్కడే కూలబడ్డాడు రాజరత్నం.

అయితే లక్ష్మణరావు గారు మాత్రం దర్జాగా, లూనాను ఓ చేత్తో పట్టుకొని, మరో చేతిని తన ప్యాంట్ జేబులో పెట్టి స్టయిల్‌గా నడుస్తున్నాడు.

'ఇంకా పిలుపురాదేమిటా' అని తల పైకెత్తి చూసి "ఓర్నీ! నీ స్టయిల్ పాడుగాను, కుక్కి లూనా, కుక్కి పోజులూ" అని మనసులో తిట్టుకొని లక్ష్మణరావుని అనుసరించాడు రాజరత్నం.

వీధి రెండవ మలుపులోకి వచ్చిన వాళ్ళిద్దరికి ఎప్పుడూ కనని, వినని, జరగని అత్యద్భుత దృశ్యం కనబడింది!

లక్ష్మణరావు గారి ఇంటి ముందు అతని భార్యామణి , పట్టుచీర ధారియై, ముఖంలో నవ్వును పులుముకొని, సిగనిండా మల్లెపూలు ముడుచుకొని, కంటిలో పతి విరహ ఛాయలు నింపుకొని, ఒక చేతిలో మంగళహారతి, మరో చేతిలో కుంకుమ బరిణ, బకెట్ నిండా నీళ్ళు, దాని పక్కన ఇత్తడి తాంబూలం, మరో ప్రక్కన కుర్చీ, దానిపైన టర్కీటవల్ తో దర్శనమిచ్చింది.

లక్ష్మణరావు ముందుగా తేరుకుని జూనియర్ ముందు గొప్పగా ఉండాలనే ఉద్దేశ్యంతో ఇటీవల వార్తా పత్రికలో చదివిన విషయాన్ని జ్ఞప్తికి తెచ్చుకొని "నా భార్య ప్రతిరోజూ ఇలాగే నేను బయట నుండి వచ్చానంటే చాలు... సాదరంగా ఆహ్వానిస్తుంది" అనే డైలాగ్ కొట్టాడు.

ఇంతకు ముందు ఓరోజు తన భార్య గురించీ, వాళ్ళ తరపు వారి గురించీ నానా మాటలనడం లక్ష్మణరావు మర్చిపోయినా రాజరత్నం మరిచిపోక.. అతడి కోతలకు మళ్ళీరెండు తిట్లు మనసులో తిట్టుకుని, పైకి నమస్తే కొట్టి తన ఇంటివైపు నడిచాడు.

అతనలా నడుస్తూనే ఉన్నాడు...

ఒక లెక్చరర్ ఇంటిముందు, మరో టీచర్ ఇంటి ముందు, ఇంకో క్లర్క్ ఇంటి ముందు... వీళ్ళూ వాళ్ళని కాదు... దాదాపు అందరి ఇళ్ళ ముందూ వాళ్ళ వాళ్ళ భార్యామణులు ఒకే మేకప్‌తో. ఒకే పతిభక్తి ప్రదర్శనతో ఉండడం చూసి ఆశ్చర్యంలో మునిగి- తేలి-మెల్లగా తన ఇంటి సందులోకి మళ్ళాడు.

అక్కడా అదే సీన్, అదే గెటప్‌తో తన భార్య కన్పించి...

దభేల్న కిందపడిపోయాడు!

మరో గంటకి కళ్ళు తెరిచిన రాజరత్నం తన భార్య తనను కుర్చీలో కూర్చోబెట్టి కాళ్ళు కడుగుతోన్న దృశ్యం చూసి మళ్ళీ స్పృహ తప్పాడు!

అలా ఆ అపస్మారక స్థితిలోనే అతనికి తెల్ల వారింది. మళ్ళీ రొటీన్ లైఫ్.

ఉదయం టిఫిన్ కానిచ్చి, ఎప్పుడూ లంచ్ బాక్సు ఉండే స్థలంలో లంచ్‌బాక్స్ లేకపోయే సరికి తన భార్యను అడిగే ధైర్యం లేక మెల్లగా..

"వెళ్తున్నాను" అని చెప్పి బయటపడ్డాడు.

దారిలో కుక్కిలూనా తోసుకుంటూ, చెమటలు కక్కుతూ ఆఫీస్ వైపు నడుస్తోన్న లక్ష్మణరావు గారి ననుసరించాడు.

వెంటనే లూనా రాజరత్నం చేతిలోకి రావడం, లక్ష్మణరావు గారు నడవడం, చివరకు ఆఫీసుకి చేరుకోవడం చకచకా జరిగిపోయాయి.

ఆఫీసులో ఆ మాటా, ఈ మాటా, టీ త్రాగడం, కష్టమర్లతో బేరసారాలూ, ఆఫీసర్ గారి చివాట్లూ మొదలగు కార్యక్రమాలతో ఉదయం గడిచి - లంచ్ సమయం వచ్చేసింది.

## చీకటి

"డాడీ... మా రవీంద్ర వాళ్ళ నాన్న చీకటిలో కూడా అన్ని పనులు చేసేస్తుంటారు"

"నేను మాత్రం చేయలేనట్రా"

"అయితే ఈ కార్డుమీద ఓ సంతకం పెట్టు" అంటూ ప్రోగ్రెస్ కార్డు బయటకు తీశాడా పుత్రరత్నం.


-కె.వి.మధుసూదనరావు,కాకినాడ.

ప్రతిరోజూ ఈ సమయానికి ఆఫీస్‌లో టేబుల్స్ ముందు లంచ్ బాక్సులు పెట్టుకొని, అంగడి రేట్ల నుండి హర్షద్ మోహతా కేసు వరకూ, ఎన్నికలూ, రాజకీయాలూ ఒకటేమిటి ప్రతి ఒక్కటీ చర్చించుకుని, ఆ మాట కొస్తే వాదులాడుకొని, అభిప్రాయ భేదాలు తెచ్చుకొని, యుద్ధ వాతావరణాన్ని గుర్తుకుతెచ్చేవారు. అదేమిటో ఈరోజు ఎవరి ముందూ లంచ్ బాక్సుల్లేవు. ఎవరూ ఏమీ మాట్లాడ్డం లేదు!

అంతా మౌనం.

ఒక లక్ష్మణరావు మాత్రం ఎప్పటిలాగే ఉన్నాడు. చాలా రోజుల నుండి డైటింగ్ చేస్తోన్నందు వల్ల లంచ్ చేయడం మానేసి ఫ్యాన్‌తో డజన్లకొద్దీ పళ్ళు తెప్పించుకొని కూర్చున్నాడు.

ఈరోజు కూడా తన ముందున్న అరటి పళ్ళ వైపు చూస్తూ, ఎవరూ ఎవర్తోనూ మాట్లాడం లేదు, తినడం లేదని గ్రహించి ఇప్పుడు ఈ అరటి పళ్ళు తనుతినడం



## అక్కకి చెల్లి పోటీ?

వర్ధమాన హిందీ హీరోయిన్ సొనాలీ బెంద్రే ఇంకా చిత్ర సీమలో నిలదొక్కుకొనే లేదు. అప్పుడే ఆమె చెల్లెలు కూడా హీరోయిన్ అయిపోవాలని ప్రయత్నాలు మొదలుపెట్టింది.

అయితే తన చెల్లెలి వైఖరి సొనాలీకి బొత్తిగా నచ్చక.. 'ముందు డిగ్రీ పూర్తి కానియ్యి. తర్వాత టీవీ సీరియల్స్‌లో నటించు. ఆ తర్వాత సినిమాల్లోకి వద్దువు గాని' అని చెల్లెలికి నచ్చ చెబుతోందిట.

అవును మరి తనకి తన ఇంట్లోంచే పోటీ వచ్చినట్టు అవదా? అందుకే ఇలా అంటోంది అని చెప్పుకుంటున్నారు బాలీవుడ్ జనాలు!

-మౌర్య.



మొదలెడ్తే అంతే సంగతి అని అనుకొని ఆ పళ్ళను పక్కన బెట్టి.

"ఏమోయ్! ఈరోజు కూడ బలుక్కుని ఎవరూ బాక్స్ తెచ్చినట్టులేదు! ఏమైనా డిన్నరుందా.. లేక మహిళలు బంద్ పాటిస్తూ డైటింగ్ చేయమని బలవంతం చేస్తున్నారా!" అని అడిగాడు.

అందరూ కోరస్‌గా అవునవునని అరిచి నిట్టూర్చారు.

ఆ క్షణమే ఆ ఆఫీసు ముందు ఆటోలు వచ్చి ఆపడం... 'ఏమిటీ- ఆటోల దాడా?' అని అనుకునే లోపునే ఆఫీసర్ గారి భార్యామణి పట్టుచీర కట్టుకొని, చేతి లో బుట్ట. బుట్టలో క్యారియర్. మరో చేతిలో వాటర్ బాటిల్‌తో ఆఫీసులో ప్రత్యక్షమైంది.

. "ఓహో! ఆఫీసర్ గారిది ఏమి అదృష్టం. మాకు లంచ్‌బంద్. ఆఫీసర్ గారికి బూరెల భోజనం" అని లక్ష్మణరావు గారితో సహా అందరూ అనుకుంటూన్నంత లోపునే...

సీనియర్ లక్ష్మణరావు గారి భార్యామణి, ఆఫీసర్ గారి భార్యామణి ఆఫీసులో అడుగెట్టారు.

ఆమె వెనకే రాజరత్నం భార్యామణి, హెడ్ క్లర్క్ భార్యామణి, ప్యూన్ భార్యామణి... ఒకరేమిటి ఆఫీసులో పనిచేస్తోన్న వాళ్ళ భార్యామణులందరూ ప్రత్యక్ష మయ్యారు!

అసలే ఇరుకైన ఆఫీసు, అందులో సతీసమేతంగా మధ్యాహ్న భోజన పథకం అమలు!

ఇహనేం...

టేబుల్‌పైన ఒక జంట, టేబుల్ కింద ఒక జంట.. మెట్లపైన, మెట్లకింద, సైకిల్‌స్టాండ్‌లో, చెట్టుకింద, ఎక్కడబడ్తే అక్కడే భర్తల్ని కూర్చోబెట్టుకొని, నాలుగు ముద్దలు కుక్కించి లంచ్ అయిందని పించారు.

అప్పటికీ అపస్మారక స్థితిలో నున్న భర్తల్ని వాళ్ళ వాళ్ళ సీట్లలో కూర్చోబెట్టి... 'ఎవరు ఏం చీర కట్టుకున్నారు? ఎవరు ఎలాంటి నగలు పెట్టుకున్నారు అని అతివలందరూ ఒకర్నొకరు జాగ్రత్తగా పరిశీలించి.. ఆ తర్వాత ఒక్కరొక్కరే బయటపడ్డారు.

భార్యామణులు బయట కాలెట్టగానే సమస్త సిటీ ఆటో డ్రైవర్లందరూ లోపల కాలెట్టారు. వారి లీడర్ కాబోలు ఒకతను ఒక స్టూల్ ఎక్కి..

"అమ్మ గార్లందరూ ప్రతిరోజు ఇలాగే లంచ్‌లో వస్తారట, అప్ అండ్ డౌన్ ఛార్జీలకు అడ్వాన్స్‌గా వేయి రూపాయలు ఇవ్వమన్నారు" అని ఉపన్యసించాడు.

ఈ ఉపన్యాసం చూడగానే కొత్త బ్లేడ్‌తో పర పరా గోకినా రక్తం రానట్లు తెల్లగా మారిపోయాం అయ్యగార్ల ముఖాలు.

'ఈ ఆటోచార్జీలేంటి! అసలే నీటి కొరతంటే ఆ నీళ్ళతో కాళ్ళు కడగడం ఏమిటి? ఈ పతిభక్తి ప్రదర్శన మొలెట్టింది ఎవరు? ఎందుకు? ఏమీ అర్థంకాలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయి - పతిభక్తి ఆఫీసు నుండి జిల్లాకూ, జిల్లా నుండి రాష్ట్రానికీ, రాష్ట్రం నుండి దేశానికీ విస్తరిస్తే ..ఈ అదనపు భారంభరించేదెలా' అని ఆలోచిస్తూ...

అపస్మారక స్థితిలో కెళ్ళిపోయిన ఆఫీస్ స్టాఫ్‌కి మర్నాడు ఎవరింట్లో వాళ్ళకి స్పృహ వచ్చి... పక్కకి చూస్తే బెడ్‌మీద ఆ కిందటి రోజు న్యూస్ పేపర్లో ప్రధానమంత్రి భార్య ప్రధాన మంత్రికి లంచ్ తెచ్చిన వార్తని చేతిలో హాట్‌ప్యాక్‌తో 'ఆవిడ ఫోటో' బాక్స్ కట్టి ప్రచురించిన న్యూస్ పేపర్ చదివి తమ భార్యామణుల పతిభక్తికి కారణం గ్రహించి... ఉబ్బి తబ్బిబ్బై.. ఉక్కిరిబిక్కిరై మళ్ళీ స్పృహ తప్పారు!★

